సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం : 24 : డిసెంబర్ : 2024




ట్రిపుల్ ఐటీ ఔదార్యం

విద్యార్థిని ప్రాణాలు కాపాడేందుకు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం కృషి చేస్తోంది. అనూష బ్రెయిన్ స్ట్రోక్‌తో పడిపోగా వెంటనే ఆస్పత్రిలో చేర్పించి రూ.2 లక్షలు చెల్లించారు. 8లో ▸



పార్శిల్ శవం కేసు తుదిదశకు

పార్శిల్ శవం కేసు కొలిక్కివచ్చినట్లు సమాచారం. మృతుడి వివరాలు పోలీసులు గుర్తించగా.. ఈ కేసులో ప్రధాన నిందితుడిని కూడా అరెస్ట్ చేసినట్లు తెలిసింది. 8లో ▸



బంగారం వ్యాపారి అరెస్టు

పలువురు జ్యూయలర్స్ నుంచి బంగారం, వెండితో ఉడాయించిన బంగారం వ్యాపారిని తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

శాశ్వత పరిష్కారం చూపాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ మళ్లీ అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. పలు సమస్యలపై మొత్తం 11 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) శ్రీ వి.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీదారులకు ప్రత్యేక బస్సులు

భీమవరం (ప్రకాశంచౌక్): పీజీఆర్ఎస్ అర్జీదారుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ప్రతి సోమవారం ప్రత్యేక ఉచిత బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మెయిన్ రోడ్డు నుంచి కలెక్టరేట్ కు వయోవృద్ధులు, వికలాంగులు చేరుకోవాలంటే రెండున్నర కిలోమీటర్లు ప్రయాణించాల్సి రావడం వ్యయ ప్రయాసలతో పాటు ఖర్చుతో కూడుకుంది. ఈ విషయమై డీఈఓతో చర్చించి ప్రతివారం ఒక స్కూల్ బస్సును రెండు ట్రిప్పులు వేసేలా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సుమారు ఉదయం 9 గంటలకు, 10 గంటలకు, తిరిగి కలెక్టరేట్ నుండి మధ్యాహ్నం 12 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు వయోవృద్ధులు, దివ్యాంగ అర్జీదారులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

27న ఎస్సీ వర్గీకరణ కమిషన్ పర్యటన

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణపై విచారణకు నియమించిన కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా ఈనెల 27న జిల్లాలో పర్యటించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 11.00 గంటలకు ఏలూరు కలెక్టరేట్ గోదావరి మీటింగ్ హాల్‌లో జిల్లా యంత్రాంగం, వివిధ ఉప కులాల సభ్యులు, సంఘాలతో సమావేశమై వినతి పత్రాలు స్వీకరిస్తారన్నారు.

ముసాయిదా కాపీల దహనం



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న రైతు సంఘు నాయకులు

ఏలూరు(టూటౌన్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్కెట్ చట్టం ముసాయిదాను తక్షణం రద్దు చేయాలని, రైతు ఉద్యమంపై నిర్బంధ చర్యలు ఆపాలని సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ముసాయిదా కాపీలను దహనం చేసి కేంద్ర ప్రభుత్వ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంఘం (అన్నే భవనం) రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు సంఘం (స్ఫూర్తి భవనం) రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోరండ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకుడు రాజనాల రామ్మోహన రావు, ఏఐకేఈఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డిహెచ్. రంగనాథం, రైతు కూలీ సంఘం(ఆంధ్ర ప్రదేశ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.కె.బాషా, బికేయంయు జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు కె.వి రమణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చకు రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులతో జరిపే పరీక్షా పే చర్చకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే జనవరి 14 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు అందరు ప్రధానోపాధ్యాయులు పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సంసిద్ధం చేసి 100 శాతం రిజిస్ట్రేషన్‌లు జరిగేలా చేయాలని ఆదేశించారు.

చివరిలో అగచాట్లు

ఈ ఏడాది ఆరంభంలో సాగు రైతన్నల్లో ఎన్నో ఆశలు రేకెత్తించగా.. చివరి ఆరునెలలు మాత్రం చేదు అనుభవం మిగిల్చింది. సార్వత్రిక ఎన్నికల వేడిలోనూ రబీ ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగితే.. ఖరీఫ్ ఆరంభం నుంచి చివరి వరకు రైతులకు అవస్థలు తప్పలేదు. కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ సాయాన్ని అందించకపోగా ఉచిత పంటల బీమా పథకానికి ఎసరు పెట్టింది. తుఫాన్‌లు, అల్పపీడనాలు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. మరోపక్క బ్యాక్టీరియా, వైరస్ తెగుళ్లతో ఆక్వా నష్టాల బాట పట్టగా, తెల్లదోమ ప్రభావంతో కొబ్బరి దిగుబడులు తగ్గాయి.



పెనుగొండ రోడ్డులో తుపానుతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు (ఫైల్)

- గత సర్కారు అండతో గట్టెక్కిన రబీ
- కూటమి పాలనలో భారీ వర్షాలు, వరదలతో నష్టాలు మిగిల్చిన ఖరీఫ్
- కర్షకులకు కలిసిరాని చివరి ఆరు నెలలు
- భరోసానివ్వని కూటమి సర్కారు
- ఉచిత పంటల బీమా పథకానికి ఎసరు
- బ్యాక్టీరియా, వైరస్ తెగుళ్లతో కష్టాల్లో ఆక్వా సాగు
- తగ్గిన కొబ్బరి దిగుబడులు

సాక్షి, భీమవరం : రబీ నాట్లతో జిల్లా రైతులు 2024 సంవత్సరాన్ని స్వాగతించారు. 2.3 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఏప్రిల్ నెలలో వరికోతలు మొదలయ్యే నాటికి సార్వత్రిక ఎన్నికల హడావుడి ముమ్మరం కాగా రైతులకు ఇబ్బంది కలుగకుండా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 9.45 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా కాగా 7.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా జిల్లాలో 324 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. 1.8 కోట్ల గోనెసంచులు సిద్ధం చేసింది. రైతులకు సత్వర చెల్లింపుల కోసం చర్యలు తీసుకుంది. జూన్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరగా దాళ్వా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సకాలంలో చెల్లింపులు చేయక పలుచోట్ల రైతులు నిరసనల తెలిపారు.



ఖరీఫ్ ప్రారంభం నుంచి కష్టకాలమే..

జూన్‌లో జిల్లాలోని 2.05 లక్షల ఎకరాల విస్తీర్ణంలో తొలకరి సాగు మొదలవగా జూలైలో బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. 38 వేల ఎకరాల్లోని నాట్లు, నారుమడులకు రూ.41.51 కోట్ల నష్టం, 614 మంది రైతులకు చెందిన 500 ఎకరాల్లోని ఉద్యాన పంటలకు రూ.4.06 కోట్ల నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు, సర్వేలో మాత్రం 9,918 రైతులకు చెందిన రూ.9.54 కోట్ల పంటకు నష్టం వాటిల్లినట్టు లెక్కతేల్చారు. రైతులకు పూర్తిస్థాయిలో ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదన్న విమర్శలున్నాయి. కోతలు మొదలైన సమయంలో ఫెంగల్ తుఫాను రైతులను పరుగులు పెట్టించింది. ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం గేట్లు తెరవడంతో వారు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి. కామన్ వెరైటీ 75 కేజీల బస్తాకు రూ.1,725 మద్దతు ధర కాగా తేమ శాతం పేరిట బస్తాకు రూ. 200 నుంచి రూ.300 వరకు కోతపెట్టారు. తెగుళ్లు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో 30 బస్తాల లోపే దిగుబడులు రావడంతో చాలామందికి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. ప్రస్తుత సీజన్‌కు 2.3 లక్షల ఎకరాల్లో దాళ్వా పనులు మొదలయ్యాయి. ముందుగా కోతలు పూర్తయిన తాడేపల్లిగూడెం ప్రాంతంలో నాట్లు మొదలుకాగా మిగిలినచోట్ల నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

కొండెక్కిన అన్నదాత సుఖీభవ

పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలోని 86,610 మంది రైతులకు రెండు విడతల్లో కేంద్ర ప్రభుత్వం రూ. 34.64 కోట్లు సాయం అందించింది. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతులకు రూ. 20 వేలు చొప్పున సాయం అందిస్తామన్న హామీనీ కూటమి ప్రభుత్వం అమలుచేయలేదు. పైగా ఉచిత పంటల బీమా పథకానికి ఎసరుపెట్టింది. ప్రస్తుత రబీ నుంచి రైతులే ప్రీమియం చెల్లించుకోవాలి. ఎకరాకు పంట విలువ రూ.41,000లో ప్రీమియంగా రెండు శాతం రూ.820 బీమా చెల్లించాల్సి ఉంది. దీనిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.205లు చెల్లిస్తే, మిగిలిన 1.5 శాతం మేర రూ.615లు రైతులే చెల్లించాలి. జిల్లాలోని 2.3 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరుగనుండగా ఒక్కో పంటకు కూటమి ప్రభుత్వం దాదాపు రూ.14.15 కోట్లు భారాన్ని మోపింది.



రొయ్య విలవిల

జిల్లాలో 1.2 లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతోంది. 60 శాతం మేర వనామీ సాగవుతుండగా మిగిలిన విస్తీర్ణంలో చేపలు పెంచుతున్నారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణంతో చెరువుల్లో పీహెచ్, అమ్మోనియా, నైట్రేట్, ఆక్సిజన్ శాతాల్లో హెచ్చు తగ్గులతో వైరస్ బెడద వెంటాడింది. చాలా చెరువుల్లో 35 రోజుల లోపే రొయ్యలు చనిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వైట్‌స్పాట్, విబ్రియో, వైట్‌గట్, ఈహెచ్‌పీ తదితర వ్యాధులు ప్రబలి రొయ్యలు మృత్యువాత పడటంతో నిర్దీత కౌంట్ రాకుండానే చాలా చోట్ల రైతులు హడావుడిగా పట్టుబడులు చేశారు. ఆక్వా రైతులకు ఇస్తామన్న విద్యుత్ రాయితీలపై కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదు. మరోపక్క జిల్లాలోని ఆక్వా రంగాన్ని ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆక్వా వర్సిటీ పనులను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. నరసాపురం రూరల్ లిఖితపూడిలో చేపట్టిన వర్సిటీ భవన నిర్మాణాలకు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్, కళాశాల భవనాల పనులు గతంలోనే స్లాబ్ దశకు చేరుకోగా కూటమి ప్రభుత్వం బిల్లులు విడుదల చేయక మిగిలిన పనులు నిలిచిపోయాయి.



తగ్గిన కొబ్బరి దిగుబడులు

ఆచంట, యలమంచిలి, పెనుగొండ లంకలు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లోని 23 వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు ఉండగా జిల్లా వ్యాప్తంగా ఆక్వా చెరువు గట్లపై, రోడ్ల వెంట కొబ్బరిచెట్లు ఉన్నాయి. ఏడాదికి ఎకరాకు ఆరు వేల కాయల వరకు దిగుబడి వస్తుంది. తెల్లదోమ ఉధృతితో దిగుబడి 10 నుంచి 15 శాతం వరకు తగ్గినట్టు రైతులు చెబుతున్నారు. దీంతో మార్కెట్‌లో వీటి ధర పెరిగింది. రైతు వద్ద వ్యాపారులు ఒక్కో కాయను రూ.10 నుంచి రూ.12కు కొనుగోలు చేస్తుండగా బయటి మార్కెట్‌లో రూ.20 నుంచి రూ.25 పలుకుతోంది.



ధర నాట్ 'గుడ్డు'

గుడ్డు ధర ఏడాది పొడవునా ఒడిదుడుకులకు గురైనా చివరిలో రికార్డు ధరకు చేరింది. జిల్లాలో సుమారు 250 పౌల్ట్రీలు విస్తరించి ఉన్నాయి. గుడ్లు పెట్టే కోళ్లు 1.3 కోట్ల వరకు ఉండగా రోజుకు 1.05 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. గత ఏడాది డిసెంబరు 27న రూ.6.20కు చేరగా ఈ డిసెంబరు 12న 6.30కు చేరి సరికొత్త రికార్డు నెలకొల్పి 18 నుంచి తగ్గుముఖం పట్టింది. పెరిగిన మేత ధరలు, నిర్వహణ భారంతో ఏడాది సగటు ధర రూ.5.75 ఉంటేనే గాని గిట్టుబాటు కాదు. ఈ ఏడాది రూ. ఐదు లోపే ఉండటంతో నష్టపోయామని కోళ్ల రైతులు అంటున్నారు.

హౌస్ హోల్డ్ డేటా వేగవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): మిస్సింగ్ హౌస్ హోల్డ్ సిటిజన్స్ డేటాను జతచేసే ప్రక్రియ వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్లను, ఎంపీడీవోలను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ గోకులం షెడ్ల నిర్మాణాల పురోగతి, మిస్సింగ్ హౌస్ హోల్డ్ డేటా ఎన్‌రోల్‌మెంట్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్, ఈ కేవైసీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి, డ్వామా పిడి కేసిహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట

వాల్ పోస్టర్ ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి సర్కార్ ప్రజల నెత్తిన మోయలేని కరెంట్ చార్జీలు వేస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న విద్యుత్ చార్జీల భారాన్ని ఆపాలని కోరుతూ ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాట నిరసన కార్యక్రమాన్ని జిల్లాలో పూర్తి విజయవంతం చేయాలని ముదునూరి విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆందోళన కార్యక్రమం వివరాలు వెల్లడించారు. కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పేరుతో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ఈనెల 27న నియోజకవర్గ కేంద్రాల్లో విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద ప్రజలతో కలసి ఆందోళనలు చేయాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వినతిపత్రాలు ఇవ్వాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం 6 నెలల కాలంలోనే రెండు దఫాలుగా ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.15,485.36 కోట్ల భారాన్ని మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, కౌన్సిలర్ అడిదల శరత్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం లేకుండా ఫిర్యాదులు పరిష్కరించాలి



మీకోసంలో అర్జీలు స్వీకరించి బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): డివిజన్, మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టరు చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సమావేశ మందిరంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి కలెక్టరు, జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి అర్జీలు స్వీకరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండల స్థాయి అధికారులకు కలెక్టరు దిశానిర్దేశం చేశారు. డివిజన్, మండల స్థాయిలోనే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపితే కలెక్టరేటుకు అర్జీల సంఖ్య తగ్గుతుందన్నారు. ఫిర్యాదులు స్వీకరించినప్పుడు స్నేహపూరిత వాతావరణంలో మాట్లాడితే వారి సమస్య సగం తీరుతుందన్నారు. ప్రజా ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించకుండా నిర్దీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 147 అర్జీలు వచ్చాయి.

దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలి



తణుకు మండలం మండపాకకు జి.గంగారావుకు వృద్ధాప్య పెన్షన్ వస్తుంది. అయితే గంగారావు దివ్యాంగుడు. అతనికి దివ్యాంగ పెన్షన్ రావడం లేదు. కేవలం వృద్ధాప్య పెన్షన్‌పైనే జీవిస్తున్నాడు. సోమవారం మీకోసంలో కలెక్టర్‌ను కలిసి తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరాడు.

ఇళ్లు తొలగించాలని కుట్ర



కాళ్ల గ్రామంలోని లంక రోడ్డులో చాలాకాలంగా రేకుల షెడ్లు వేసుకుని ఉంటున్న పేదల ఇళ్లను తొలగించి నిరాశ్రయులను చేయాలని ప్రయత్నిస్తున్నారంటూ బాధితులు మీ కోసంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే విద్యుత్ కనెక్షన్ తొలగించి అంధకారంలో ఉంచారని వాపోయారు. రోడ్డుకు ఎలాంటి ఇబ్బందులు లేనప్పటికీ మమ్మల్ని అక్కడి నుంచి పంపించేయాలని చూస్తున్నారని ఆదుకోవాలని కోరారు.

జీతాలు చెల్లించాలి



తాడేపల్లిగూడెం మండలంలోని 26 స్కూళ్లలో స్వీపర్లుగా పనిచేస్తున్న 26 మందికి 20 నెలలుగా జీతాలు రావడం లేదు. బిల్లులు పెట్టినప్పటికీ జీతాల మంజూరుకు చర్యలు తీసుకోవడం లేదంటూ స్వీపర్లు మీకోసంలో కలెక్టర్ నాగరాణికి ఫిర్యాదు చేశారు. బతుకుదెరువు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు వారు విన్నవించారు.

పోలీసు రిపోర్ట్ కోసం..



అత్తిలి మండలం దంతుపల్లి గ్రామానికి చెందిన పద్మావతి భర్త నాగేశ్వరరావు కొబ్బరి దింపు కార్మికుడు. ఈ ఏడాది ఫిబ్రవరి 17న మాముడూరులో చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ పడిపోయి తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మాముడూరు –దంతుపల్లి మధ్యలో సంఘటన జరగడంతో పోలీసులు పట్టించుకోలేదు. పెనుమంట్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. పోలీసులు ఫైనల్ రిపోర్ట్ ఇస్తే బీమా వస్తుందంటూ పద్మావతి 9 నెలలుగా పోలీసుల చుట్టూ తిరుగుతుంది.

భూమిని ఆన్‌లైన్ చేయాలి



ఈ ఫొటోలో వ్యక్తి పేరు ఎం.అర్జున మూర్తి. కాకినాడకు చెందిన అతనికి పోడూరు మండలం గుమ్ములూరులో 4.02 ఎకరాల భూమి ఉంది. కేవలం 3 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్ అయ్యింది. 1.02 ఎకరాలు ఆన్‌లైన్‌లో చూపించడం లేదని ఆన్‌లైన్ చేయాలని కోరుతున్నాడు. అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో మీ కోసంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఓవర్ లోడుకు రూ.1.70 కోట్ల జరిమానా!

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఒక లారీకి వాహన తనిఖీ ఇన్స్‌పెక్టర్ జరిమానా విధించారు. జరిమానా చూసి ఈ వాహన యజమాని బెంబేలెత్తిపోయాడు. ఏలూరులో పని చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఆదివారం వాహన తనిఖీలు చేస్తూ.. ఓ లారీపై ఓవర్ లోడ్ కేసు నమోదు చేశారు. సదరు అధికారి 3 టన్నుల అదనపు లోడ్‌కు బదులు 3 వేల యూనిట్లుగా పొందుపరిచారు. కంప్యూటరైజ్డ్ బిల్లు 3 వేల టన్నులకు రూ.1.70 కోట్ల జరిమానా విధించినట్లుగా రసీదు ఇచ్చింది. దీంతో లబోదిబోమంటూ బాధితుడు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నాడు. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆరా తీసిన జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ ఖాసిమ్ సదరు అధికారి 3 వేల కిలోలను 3 వేల యూనిట్లుగా నమోదు చేసినట్లు గుర్తించారు. సోమవారం ఉదయం దానిని సరిచేసి విషయాన్ని వాహనదారుడికికి తెలిపినట్టు ఖాసిమ్ ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

రోలర్ స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో ఈనెల 5వ తేదీన నిర్వహించిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో తణుకు మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు సత్తా చాటి విజేతలుగా నిలిచారు. ఇన్‌లైన్ హాకీ కాడెట్ అండర్-11 విభాగం నందు మైత్రి దాస్ బంగారు పతకం, రోలర్ మిక్స్‌డ్ హాకీ కాడెట్ అండర్-11 విభాగం నందు కె.నితీష్ గౌడ్ కాంస్య పతకం, రోలర్ మిక్స్‌డ్ హాకీ సబ్ జూనియర్ అండర్-14 విభాగం నందు జి.జస్వంత్ కాంస్య పతకంలను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలెక్టరేట్ చాంబర్ నందు కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి, మాంటిస్సోరి స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.జ్ఞాన మంజరి, ఆంధ్ర ప్రదేశ్ టీమ్ కోచ్ ఏ.భార్గవ్, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ నందమూరి రాజేష్, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.రాజేష్ ఉన్నారు.

27న క్రికెట్ సెలెక్షన్స్

ఏలూరు రూరల్ : ఈ నెల 27వ తేదీన ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల ఆవరణలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ జట్టు సెలక్షన్స్ నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు జి ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు సంయుక్త ప్రకటనలో తెలిపారు. జట్టుకు ఎంపికైన వారు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించబోయే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గలవారు పుట్టినతేదీ సర్టిఫికెట్, ఆధార్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో శుక్రవారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

ఇరగవరం: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇరగవరం మండలం రేలంగి రైల్వే గేటు వద్ద ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలు నుంచి జారిపడినట్టుగా రైల్వే పోలీసులు భావిస్తున్నారు. భీమవరం రైల్వే ఎస్సై రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు 70939 39777, 90140 99132లను సంప్రదించాలని కోరారు.

చెట్టుపై నుంచి పడి..



మునేశ్వరరావు (ఫైల్)

పాలకొల్లు అర్బన్: పాలమూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు పాలా నాగమునేశ్వర రావు (64) సోమవారం సాయంత్రం చెట్టుపై నుంచి పడి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



ఏలూరు ఆదివారపుపేట చర్చిలో క్రిస్మస్ ట్రీ



కాళ్ళ మండలం ప్రాతాళ్ళమెరకలో విద్యుత్ దీపాలంకరణలో చర్చి




ఏలూరు సీఎస్ఐ చర్చి వద్ద పశువుల పాక సెట్టింగ్

క్రిస్మస్ కాంతులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. రకరకాల విద్యుత్ దీపాలతో చర్చిలను సుందరంగా అలంకరించారు. ఏసు జన్మదినానికి అర్థం పట్టేలా ఏర్పాటు చేసిన పశువుల పాకలు, క్రిస్మస్ ట్రీలు విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంటున్నాయి. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు, కాళ్ల



విద్యుత్ కాంతుల్లో ఏలూరు అమీనాపేటలోని లూథరన్ చర్చి

తుది దశకు పార్శిల్‌లో శవం కేసు

- మృతుడు కాళ్ల మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు
- అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు !

ఉండి: రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన యండగండి పార్శిల్‌లో శవం కేసు ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తుంది. మృతుడి వివరాలు తెలిసినట్లు సమాచారం. అలాగే ఈ కేసులో ప్రధాన నిందితుడిని కూడా పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. అయితే ఈ వివరాలను పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. ఈనెల 19వ తేదీ సాయంత్రం యండగండి రాయపేటలోని ముదునూరి రంగరాజు ఇంటికి ఆటోలో పార్శిల్‌లో ఓ శవం వచ్చింది. ఆ శవం ఎవరిదీ, దోషి ఎవరు, హత్యకు గల కారణాలు వంటి వివరాలు పోలీసులకు సవాల్‌గా మారాయి.

మృతుడి ఆచూకీ గుర్తింపు

పార్శిల్‌లో ఉన్న మృతదేహం కాళ్ల మండలం గాంధీనగర్‌కు చెందిన బర్రే పర్లయ్యగా గుర్తించినట్లు సమాచారం. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యసనాలకు అలవాటుపడటంతో కుటుంబ సభ్యులు పట్టించుకోవడం మానేశారు. అయితే చనిపోయే రెండు రోజుల ముందు అనుమానితుడు శ్రీధర్‌వర్మ వద్ద పనికి వెళ్లినట్టు తెలిసింది. అప్పటి నుంచి పర్లయ్య కనిపించకపోవడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించి హత్యకు గురైంది పర్లయ్య అని నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది.



పార్శిల్‌లో శవం వచ్చిన చెక్క పెట్టె ఇదే

రహస్యంగా విచారణ

పార్శిల్‌లో శవం ఘటన జరిగి ఇప్పటికీ నాలుగు రోజులు గడుస్తుంది. అనుమానిత మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం పర్లయ్యను హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ కేసులో ముదునూరి రంగరాజు అతని భార్య హైమావతి, కుమార్తెలు రేవతి, తులసీలతో పాటు కాళ్ళ మండలంలోని అనుమానితుడు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతాల్లో ఒకరికి తెలియకుండా మరొకరిని విచారించినట్లు తెలుస్తుంది.

పోలీసుల అదుపులో నిందితుడు!

పోలీసుల గాలింపులో భాగంగా ఎరుపు రంగు కారు ప్రయాణించిన మార్గంలో సీసీ టీవీ కెమెరాలను పరిశీలిస్తూ కృష్ణా జిల్లా బంటుమిల్లి గ్రామంలో ఓ వృద్ధుడి వివరాల ఆధారంగా పోలీసులు బృందంతో వెళ్లి నిందితుడు శ్రీధర్‌వర్మ, శవం ఉన్న చెక్క పెట్టెను ఆటోలో ఎక్కించిన మహిళను అదుపులోకి తీసుకుని భీమవరం తీసుకువస్తున్నట్టు సమాచారం.

హత్య అందుకోసమేనా?

ఈ కేసులో ప్రధాన అనుమానితుడు శ్రీధర్‌వర్మ బర్రే పర్లయ్య అనే వ్యక్తిని హత్య చేసి ఆ హత్యానేరాన్ని తన వదిన, అత్తామామలపై మోపాలని చూస్తున్నట్లు తెలుస్తుంది. అత్తమామల వద్ద ఉన్న మూడెకరాల పొలం, ఇల్లు ఇతర ఆస్తి తాను కాజేయాలని పథకం ప్రకారమే ఇదంతా చేసినట్లు అనుమానిస్తున్నారు.

అనుమానితుడు చిన్నల్లుడేనా..

ఈ కేసులో రంగరాజు చిన్నల్లుడు, రేవతి భర్త శ్రీధర్‌వర్మ అలియాస్ సిద్ధార్థ, సుధీర్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్నారు. పోలీసుల విచారణలో శ్రీధర్ వర్మ గురించి విస్తుపోయే నిజాలు తెలుస్తున్నాయి. ఒకరికి తెలియకుండా ఒకరిని మొత్తం ముగ్గురు మహిళలను అతడు వివాహం చేసుకున్నట్టు తెలుస్తుంది. ఇతని మొదటి భార్యది కాళ్ళ మండలం ఎస్సీ బోస్ కాలనీ పంచాయతీలోని ఇస్కులంక. వీరంతా కాళ్ళ మండలంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్నారు. రెండవ భార్యగా ప్రస్తుత కేసులో విచారణ ఎదుర్కొంటున్న రేవతి. మూడో భార్యది కాళ్ల గ్రామం. అలాగే అతను నేర ప్రవృత్తి కలిగినవాడుగా పోలీసులు భావిస్తున్నారు. కాళ్లలోని అతని ఇంట్లో మృతదేహాన్ని పార్శిల్ చేసిన చెక్కపెట్టె మాదిరి మరో పెట్టె ఉండటాన్ని పోలీసులు గమనించినట్లు సమాచారం.

చీటింగ్ కేసు నిందితుడు జైలుకు తరలింపు

కైకలూరు: కీర్తన ఫైనాన్స్ కంపెనీలో చీటింగ్ చేసిన ఏ-2 నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు మచిలీపట్నం జైలుకు తరలించినట్లు కైకలూరు పట్టణ సీఐ పి.కృష్ణ సోమవారం తెలిపారు. కైకలూరు కీర్తన ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ రుద్రపాటి సూర్యం, వైస్ ప్రెసిడెంట్ రుద్రపాటి స్కైలాబ్ కస్టమర్ల నుంచి డాక్యుమెంట్లు తీసుకుని వారి పేర్ల మీదు లోన్లు తీసుకుని రూ.25 లక్షలు మోసం చేశారన్నారు. దీనిపై కీర్తన ఫైనాన్స్ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. వీరిలో ఏ-1 రుద్రపాటి సూర్యంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఏ-2 నిందితుడు రెడ్డిగూడెం మండలం ముచ్చునపల్లికి చెందిన స్కైలాబ్ ఈ నెల 13న లాయరు సాయంతో కోర్టులో లొంగిపోయాడన్నారు. అతడిని పోలీస్ విచారణకు కోరగా మేజిస్ట్రేట్ ఈ నెల 21 నుంచి 23 వరకు అవకాశం ఇచ్చారన్నారు. విచారణ అనంతరం సోమవారం తిరిగి కైకలూరు కోర్టులో హాజరుపర్చగా జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులతో మచిలీపట్నం జైలుకు పంపించినట్లు సీఐ చెప్పారు.

బంగారం వ్యాపారి అరెస్ట్

- రూ.8 కోట్ల విలువైన బంగారం, వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ డి విశ్వనాథ్

తాడేపల్లిగూడెం అర్బన్: పలువురు జ్యూయలర్స్ దుకాణదారుల నుంచి బంగారం, వెండి తీసకుని ఉడాయించిన బంగారం వ్యాపారిని తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన లెంకా మోహన రావు కొన్నేళ్లుగా బంగారం వ్యాపారం చేస్తున్నాడు. వాయిదాల పద్ధతిలో నగదు చెల్లిస్తే వాయిదాలు పూర్తయిన అనంతరం నగదుకు సరిపడా బంగారు వస్తువులు ఇస్తామని పట్టణ వాసులతోపాటు పరిసర గ్రామాల ప్రజల నుంచి సొమ్ములు వసూలు చేశాడు. ఇదిలా ఉండగా కొన్ని నెలల క్రితం తాడేపల్లిగూడెం ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో ఒక షాపును అద్దెకు తీసుకుని తన భార్య పేరున మన్వి జ్యూయలర్స్ బంగారం షాపును ప్రారంభించాడు. పట్టణంలోని పలువురు బంగారం వ్యాపారుల నుంచి బంగారాన్ని, వెండిని అప్పుగా తీసుకుని నెలనెలా వడ్డీని చెల్లిస్తున్నాడు. అయితే కొందరికి గడువు తీరినా బంగారం ఇవ్వకపోగా రోజూ మాట దాటవేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా బంగారు షాపును సైతం తెరవకపోవడంతో వాయిదాల పద్ధతిలో సొమ్ములు చెల్లించిన వినియోగదారులు అతని కుటుంబ సభ్యులను ఆరా తీయగా తమకు తెలియదని చెప్పారు. దీంతో మోసపోయామని బాధితులు గ్రహించారు. ఇదిలా ఉండగా తనను మోసం చేసి బంగారాన్ని కాజేశాడని నరసాపురానికి చెందిన కుహద్ అనిల్‌కుమార్ జైన్ స్థానిక పట్టణ పోలీసులకు లెంక మోహనరావుపై ఫిర్యాదు చేశాడు. ఇతనితోపాటు బంగారు వస్తువులకు సొమ్ములు చెల్లించిన మరికొందరు వినియోగదారులు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆదేశాల మేరకు డీఎస్పీ డి విశ్వనాథ్ సూచనలతో పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం దర్యాప్తు ప్రారంభించారు. మోహనరావు భార్యను అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు విశాఖపట్టణం, హైదరాబాద్ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు తెలియడంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ సమీపంలో నిందితుడు మోహన్‌రావును గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. తాడేపల్లిగూడెంలోని మహాలక్ష్మీనగర్‌లో అతని ఇంటిని సోదాచేయగా 6.758 కిలోల బంగారు ఆభరణాలు, బంగారు బిస్కెట్లు, 106.772 కిలోల వెండి వస్తువులు, రూ.3 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. మోహనరావుపై 318(4), 316(5) బీఎన్ఎస్ సెక్షన్లతో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ సుమారు 7 కోట్లు, వెండి విలువ సుమారు రూ.కోటి కలిపి మొత్తం రూ.8 కోట్లు పైనే ఉండవచ్చని అంచనా వేశారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ డి విశ్వనాథ్, చిత్రంలో సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్సై పి.నాగరాజు

ఆభరణాలు తయారు చేసి ఇస్తానని మోసం

పట్టణంలోని కొందరు బంగారు వ్యాపారాలు వినియోగదారుల నుంచి ముడి బంగారాన్ని తీసుకుని బంగారు ఆభరణాలు తయారు చేయించి ఇస్తారు. ఈ విధంగానే తాను బంగారు ఆభరణాలు తయారు చేయించి ఇస్తానని నమ్మబలికి బంగారు వ్యాపారుల వద్ద నుంచి, కస్టమర్ల వద్ద నుంచి రూ.84.36 లక్షలు విలువైన 1.406 కిలోల బంగారాన్ని, తరుగు మజూరు అని రూ.1.9 లక్షలు తీసుకున్నాడు. మొత్తం రూ.85.45 లక్షలు విలువ గల బంగారాన్ని తమను నమ్మించి తీసుకున్నాడని బాధితులు పోలీసులకు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ డి.విశ్వనాథ్‌తోపాటు పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్సై పి.నాగరాజు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీ ఔదార్యం

- ఈనెల 19న ప్రథమ సంవత్సరం విద్యార్థినికి బ్రెయిన్ స్ట్రోక్
- సత్వరమే స్పందించి విజయవాడలో చికిత్స చేయిస్తున్న యాజమాన్యం

నూజివీడు: హఠాత్తుగా అస్వస్థతకు గురైన విద్యార్థిని ప్రాణాలు కాపాడేందుకు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం తమ వంతు కృషి చేస్తోంది. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వైద్యులతో చర్చిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ట్రిపుల్ ఈ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎం.అనూష ఈనెల 19న రాత్రి 10గంటల సమయంలో రూమ్‌లో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి పడిపోవడం జరిగింది. దీంతో వెంటనే డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్, ఏఓ బీ లక్ష్మణరావు ఆమెను విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ వారు మణిపాల్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్లగా వాళ్లు ముందుగా రూ.2 లక్షలు చెల్లించాలనడంతో అప్పటికప్పుడు డైరెక్టర్ అమరేంద్రకుమార్ తోటి ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీతో చర్చించి రూ.2 లక్షలను ఆసుపత్రికి చెల్లించారు. అంతేగాకుండా క్యాంపస్‌లోని హెల్పింగ్ హ్యాండ్ సంస్థతో చెప్పగా వారు గంటలో రూ.1.30 లక్షలు సేకరించి ఆసుపత్రిలో విద్యార్థిని వైద్య ఖర్చులకు అందజేశారు. అలాగే డైరెక్టర్ రెండుసార్లు విజయవాడలోని ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో సమీక్షించారు. శ్రీకాకుళంలోని గుజరాతీపేటకు చెందిన విద్యార్థిని అనూష కుటుంబం నిరుపేద కుటుంబం. రెక్కాడితేనే గాని డొక్కాడే పరిస్థితి ఉండటంతో వారి తల్లిదండ్రుల చేతిలో చిల్లిగవ్వ లేదు. ఈ పరిస్థితుల్లో దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి తమకు తోచినంత సాయం చేయాలని ట్రిపుల్ ఐటీ వర్గాలు కోరుతున్నాయి. అలాగే ప్రభుత్వం కూడా విద్యార్థిని వైద్య ఖర్చులకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనూష

నరసాపురంలో పట్టపగలే చోరీ

నరసాపురం: పట్టణంలో సోమవారం పట్టపగలే ఓ ఇంటిలో చోరీ జరిగింది. 6 గ్రాముల బంగారు వస్తువులు, రూ.70 వేలు విలువ చేసే వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక వైఎస్సార్ కాలనీలో లక్కు లక్ష్మి తన ఇద్దరి పిల్లలతో నివాసం ఉంటుంది. ఉదయం 11.30 గంటలకు ఇంటికి తాళంవేసి ఆసుపత్రికి వెళ్లింది. తిరిగి 12 గంటల సమయంలో రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమిచించింది. బీరువాలో బంగారం, వెండి వస్తువులు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మి ఇంటిలో లేని సమయంలో ఇంటి నుంచి శబ్దాలు వచ్చాయని, ఓ వ్యక్తి పరుగున బయటకు వెళ్లడాన్ని గమనించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎస్సై ముత్యాలరావు ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బాలికను మోసం చేసిన కేసులో ఇద్దరి అరెస్ట్

ఏలూరు (టూటౌన్): విద్యార్థిని ప్రసవానికి కారణమైన ఇద్దరు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు డీఎస్పీ డీ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాలివి. ఏలూరు అశోక్ నగర్‌లోని సెయింట్ జోసఫ్ ఆధ్యాత్మిక కేంద్రం బాలికల హాస్టల్‌లో చదువుకుంటున్న ఒక విద్యార్థిని (16) ఈనెల 8వ తేదీ తెల్లవారుజామున ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఆ నవజాత శిశువును హాస్టల్ భవనం మూడో అంతస్తునుంచి కింద పడవేశారు. ఆమె గర్భానికి కారణమైన దెందులూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన జుజ్జూరి అఖిల్ (24), నంద్యాల జిల్లా చాపిరేవుల గ్రామానికి చెందిన దండు రాజీవ్ (30)గా గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు. అఖిల్ హాస్టల్ సమీపంలోనే ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ స్కూలు ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తూ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడగా, సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌లో ట్యూషన్ చెప్పడానికి వచ్చే దండు రాజీవ్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి లోబరుచుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులే మేలు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, వనరుల విక్రయ కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. స్టాల్‌లో మొదటగా ఉత్పత్తులను కలెక్టర్, జేసీ కొనుగోలు చేసి రైతులను అభినందించారు. జిల్లాలో 14 మంది రైతులు తీసుకువచ్చిన ఆర్ఎన్ఆర్ (షుగర్ లెస్), నవరా, కుచిపడాలియా, సిద్ధి సన్నాయి, చిట్టిముత్యాలు, సాంబ మసూరి, రత్నం చోడి, కులాకార్ వంటి 8 రకాల బియ్యాన్ని, పసుపు, కారం, వివిధ రకాల కూరగాయలు, పండ్లు తదితరాలను అధికారులు పరిశీలించి రైతులు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు, జిల్లా కోఆర్డినేటర్ ఎం.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్‌లో విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

పశువధ.. గ్రామస్తులకు వ్యధ



తేతలి సత్యవాడ రోడ్డులో పశు వధ కర్మాగార గేటు వద్ద నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న మహిళలు (ఫైల్)



పాడిగేదెలతో వచ్చిన వాహనాలను అడ్డుకున్న స్థానికులు, గోసేవా సమితి సభ్యులు (ఫైల్)

- దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం
- అసలు ప్రభుత్వం ఉందా?
- ఎమ్మెల్యేకి చెప్పాం.. కలెక్టరుకు ఫిర్యాదు చేశాం
- మమ్మల్ని మనుషులుగా చూడరా?
- పశు వధ ప్రాంత నివాసితుల ఆవేదన

తణుకు అర్బన్: ప్రభుత్వం పట్టించుకోవట్లేదు.. అధికారులు మాట్లాడడంలేదు. పాడిగేదెల వధ ఆగడంలేదు. దుర్వాసనతో ఉండలేకపోతున్నాం. పిల్లలతో ఉన్నాం ఏం రోగాలొస్తాయోనని భయం.. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు విన్నవించుకున్నాం. కానీ పరిష్కారంలేదు. ఏ ఒక్కరూ మమ్మల్ని చూసేందుకురాలేదు. మేము చస్తేఅయినా వస్తారా అంటూ నిలదీస్తున్నారు. తణుకు పశు వధ కర్మాగార ప్రాంత నివాసితులు. తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలోని సత్యవాడ రోడ్డులో అక్రమంగా నిర్వహిస్తున్న లేహం ఫుడ్ ప్రాడక్స్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో నిర్వహిస్తున్న కర్మాగారంలో నిత్యం పాడి గేదల వధ పాలకులు, అధికారుల కనుసన్నల్లో నిర్విరామంగా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పచ్చటి పొలాలప్రాంతంలో ఉన్న లేఅవుట్‌అని సంబరపడి తణుకు సజ్జాపురాన్ని అనుకుని తేతలి గ్రామ పరిధిలోని మహాలక్ష్మి నగర్‌లో స్థలాలు కొనుగోలుచేసి తమ శక్తిమేరకు ఇళ్లు నిర్మించుకుంటే ఈ ప్రాంతంలో పశువధ నిర్వహించే కర్మాగారాన్ని ఏర్పాటు చేశారని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. మా ఇళ్లకు సమీపంలోనే ఉన్న కర్మాగారం వ్యవహారం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నప్పటికీ దొడ్డిదారిన పాడిగేదలను వాహనాల ద్వారా లోపలకు తీసుకువెళ్లి వధిస్తున్నా రని ఇళ్లలో కూడా ఉండలేకపోతున్నామని పిల్లలు దుర్వాసనకు వాంతులు చేసుకుంటున్నారని వాపోతున్నారు.

కర్మాగారం ముసుగులో ఎవరున్నారు..?

పశు వధ నిర్వహిస్తున్న లేహం ఫుడ్ ప్రాడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యకలాపాల వెనుక పెద్ద వ్యక్తులు దాగి ఉండడంవలనే పశువధకు అనుమతులు లేకపోయినా అక్రమ మార్గంలో చట్టవిరుద్ధంగా పశువధ చేస్తున్నారని అధికారులు పట్టించుకోకపోవడం మా అనుమానాలు బలపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదంటే ఇందులో ఏదో భారీ కుంభకోణం దాగి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సత్యవాడ రోడ్డులో ఉన్న ఈ కర్మాగారంలో నిర్వహిస్తున్న పశు వధ కారణంగా తణుకు మండలంలోని మహాలక్ష్మి నగర్‌తో పాటు డ్రైవర్స్‌కాలనీ, కొండాలమ్మ పుంత, వర్కర్స్‌కాలనీ, ఇండస్ట్రీ ఏరియా, ఎఫ్‌సీఐ గోడౌన్స్, పైడిపర్రు ప్రాంతాల్లో నివసిస్తున్న 10 వేలకుపైగా ప్రజలకు ఈ సమస్య పొంచిఉందని చెబుతున్నారు. అయితే భవిష్యత్తులో భారీ స్థాయిలో పశు వధ జరిగితే దుర్వాసన తణుకు ప్రాంతానికి కూడా పాకే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ప్రభుత్వం మారింది.. పశు వధ మొదలైంది...

ప్రభుత్వం మారింది ఇదే అదనుగా ఢిల్లీస్థాయిలో పావులు కదిపి కొందరు నేతలు పశు వధకు తెరతీశారు. భారీ కుంభకోణంగా మారిన ఈ పశు వధ అధికారం అండతో కర్మాగారం వ్యవహారం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నప్పటికీ అధికారులే నడిపిస్తున్నారని గోసేవా సమితి సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. 2013–14లో టీడీపీ ప్రభుత్వ హయాంలో అనుమతులు తెచ్చుకున్న లేహం ఫుడ్ ప్రాడక్ట్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ పలు ఆటంకాలతో 2022లో ట్రైయల్ రన్ ప్రారంభించినప్పటికీ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే కారుమూరి వెంకట నాగేశ్వరరావు నిలుపుదల చేయించారు. అనంతరం స్థానికులు హైకోర్టుకు వెళ్లి అనుమతులు లేవని ధ్రువపత్రాలను చూపి కోర్టు స్టే తీసుకువచ్చారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా 2024లో ప్రభుత్వం మారి 4 నెలలు గడవగానే పశు వధను తిరిగి పట్టాలెక్కించి దుర్వాసనను స్థానిక నివాసితులకు పాలకులు బహుమతిగా అందజేశారు.

ఇళ్లు నిర్మించుకున్నాం



మీకోసంలో ఫిర్యాదు చేసిన వారం రోజులకు వచ్చిన అధికారులు ముందుగా వస్తున్న విషయం కర్మాగారం యాజమాన్యానికి తెలియజేసి రావడంతో పశు వధ నిలిపివేసి శుభ్రం చేసి ఉంచారు. దీంతో అక్కడ ఏ ఇబ్బంది లేదని అధికారులు క్లీన్‌చిట్ ఇచ్చేశారు. అంతేకాదు సీఎంవో కార్యాలయం నుంచి ఒక ఉద్యోగి ఫోన్‌చేసి మీకంటే ముందుగానే అక్కడ కర్మాగారం ఏర్పాటు చేశారు కదా మీరు ఎందుకు ఇళ్లు నిర్మించుకున్నారని అడిగారు. తేతలి పంచాయతీలో బెటర్‌మెంట్ ఛార్జీలు చెల్లించి ఇళ్లు కట్టుకున్నాం అని చెప్పాను.

– పి.దుర్గా భవాని, మహాలక్ష్మి నగర్

దుర్వాసన మధ్య నివాసముంటున్నాం



పశు వధ నిర్వహిస్తున్న కర్మాగారంలో పశు వధ జరుగుతున్న సమయాల్లో చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఇళ్లలో సైతం ముక్కుమూసుకుని ఉండాల్సి వస్తోంది. ఎక్కువగా రాత్రి సమయాల్లో ఈ వధ జరుగుతుండడంతో ఉదయానికి ఈ దుర్వాసన పెరిగిపోతుంది. ఈ ప్రాంతంలో ప్రతి ఇంట్లోను తరచూ పిల్లలు వాంతులు చేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. అసలు అనుమతులు లేకుండా ఎలా పశు వధ చేస్తున్నారు. ఈ కర్మాగారం వెనుక ఎవరు ఉన్నారో కానీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు.

– టి.విద్య, మహాలక్ష్మి నగర్

కలెక్టర్‌కు మొరపెట్టుకున్నాం



కుటుంబంలో కష్టం వస్తే ఆ కుటుంబ పెద్ద సమస్య పరిష్కారానికి కృషిచేస్తారు. ఒక ప్రాంతానికి కష్టమొస్తే ఎవరికి చెప్పుకోవాలి ప్రజా ప్రతినిధులు, అధికారులకే కదా. తణుకులోని ఎమ్మెల్యేకు, తహసిల్దారుకు, భీమవరం వెళ్లి జిల్లా కలెక్టరుకు కూడా పశు వధ కర్మాగారం వలన నీటి కాలుష్యం, గాలి కాలుష్యం ఏర్పడుతుందని స్థానికంగా ఇళ్లలో ఉండలేకపోతున్నామని మొరపెట్టుకున్నాం. కానీ అధికారులు సైతం కర్మాగారం వైపే మొగ్గుచూపుతున్నట్లుగా వ్యవహరిస్తుండడం బాధాకరం.

– బి.దేవి, మహాలక్ష్మి నగర్

క్లుప్తంగా

పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో వ్యాపార కేంద్రాలు వద్దు



మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడలోని పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థలంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజారు, డ్వాక్రా బజారు, ఇతర వ్యాపార కేంద్రాలుగా మార్చడాన్ని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఖండించారు. డ్వాక్రా బజార్ షెడ్డు నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఉన్న ఖాళీ స్థలంలో మిగిలిపోయిన కట్టడాలను పూర్తి చేయాలని, ప్రజలందరికి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలపై, సంఘటనలపై దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరంతరం ఉద్యమం చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.శివ, బాలస్వామి, కోటేశ్వరరావు, అప్పన్న, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం



మద్యం సీసాలతో నిందితుని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

తాడేపల్లిగూడెం: గూడెం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చేసిన దాడుల్లో ఒక వ్యక్తి ని అరెస్టు చేశారు. గూడెం మండలం మారంపల్లి గ్రామంలో చేసిన దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్టు చేసి , అతని వద్ద నుంచి ఆరు డ్యూటీపెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి, ఎస్ఐలు. మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్సై పీవీకే.దుర్గారావు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉంగుటూరు మండలం చింతాయగూడెం గ్రామానికి చెందిన తీర్థాల ఆదియ్య (43) గొర్రెల మందను మేపుకునేందుకు పక్క గ్రామాలకు వెళ్లాడు. అయితే, ఈ నెల 22వ తేది రాత్రి 10 గంటల ప్రాంతంలో తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామం చేరుకున్నాడు. తదుపరి రోజు ఉదయం 23న జాతీయ రహదారి 216ఏపై బాదంపూడి వైపు గొర్రెల మందతో ఆదియ్య వెళ్తుండగా శశి ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా వచ్చే సరికి ఏపీ 37ఎక్స్ 6228 నెంబరు గల లారీ అతివేగంగా ఢీకొంది. దీంతో ఆదియ్య అక్కడికక్కడే దుర్మ రణం చెందాడు. మృతుని భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్సై పీవీకే.దుర్గారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటి చూపుపై జాగ్రత్తలు పాటించాలి



కంటి శిబిరం ప్రారంభోత్సవంలో రవీంద్రనాథ్

పెనుగొండ : కంటి చూపు విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం పెనుగొండలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దివంగత జక్కం బలరామ్ స్వామి, లీలావతి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కంటి పరీక్షా కేంద్రాన్ని ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి బుధవారం పాలకొల్లు లయన్స్ కంటి ఆస్పత్రి వైద్య బృందం పెనుగొండలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లయన్స్ గవర్నర్ కాకరాల వేణుబాబు మాట్లాడుతూ గ్రామీణుల కంటి చూపు పరిరక్షణే లక్ష్యంగా పరీక్షా కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గాజుల బులివ్లాలరావు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో బాబూజీరావు, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి, డి.సుబ్బారావు, దామోర్ల రంగారావు, వేమా కోటేశ్వరరావు, ఎన్వీ వీవీఎస్ పాపారావు నాయుడు, కేసీఆర్ నర్సింహరావు, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జక్కం విజయ్ కుమార్, గుమ్మడి చంటి తదితరులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్ పై వ్యాఖ్యలు సరికాదు

పెనుగొండ: సినీ నటుడు అల్లు అర్జున్‌ను కించపరుస్తూ పోలీసులు వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఏసీపీ విష్ణుమూర్తి తక్షణం క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు పాలసత్తి రామిరెడ్డి (రాజా) డిమాండ్ చేశారు. పెనుగొండలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంధ్య థియేటర్‌లో మహిళ మరణించడం, బాలుడు గాయపడడం బాధాకరమైన విషయమేనన్నారు. పోలీసులు ప్రెస్‌మీట్‌లు పెట్టి అల్లు అర్జున్‌ను ఏకవచనంతో అవమానపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. అల్లు అర్జున్‌పై చేసిన వ్యక్తిగత విమర్శలను వెనక్కి తీసుకోవాలని కోరారు.

దివ్యాంగులను ఆదరించాలి



భవిత సెంటర్‌లో అన్నదానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని పలువురు వక్తలు తెలిపారు. భవిత సెంటర్ దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న దివ్యాంగులకు సోమవారం దాతలు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మిఠాయిలు పంచారు. షేక్ మెహరున్నీషా, ఇబ్రహీం, దినేష్ అహ్మద్, దిల్షాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు సేవలు అందించడం సంతోషదాయకమని, మరింత మంది దాతలు ముందుకు రావాలన్నారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్ర కుమారిలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



మాంటిస్సోరీ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టరు నాగరాణి

తణుకు అర్బన్: జాతీయస్థాయి 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ 2024లో పతకాలు సాధించిన తణుకు మాంటిస్సోరీ స్కూలు విద్యార్థులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం అభినందించారు. ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన ఈ పోటీలకు సంబంధించి వివిధ విభాగాల్లో బంగారు పతకం సాధించిన అందు మోయిత్రీదాస్, కాంస్య పతకాలు సాధించిన నిత్యేష్ గౌడ్, జి.యశ్వంత్, ఎం.నాగసాయి కేశవ్‌లకు కలెక్టరు చేతులమీదగా పతకాలు అందజేశారు.

పెంటపాడులో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి సూరిబాబు

పెంటపాడు: మండలంలోని సంతబజార్ ప్రాంతలోని మారెమ్మ చెరువు ప్రాంతంలో ఉన్న షారోన్ ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంఘ కాపరి రెవరెండ్ పి. స్తోత్రంరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసారు. మానవాళికి శాంతి మార్గానిన చూపిన ఏసు క్రీస్తు భోధనలు అనుసరించాలన్నారు. సంఘ కాపరి స్తోత్రంరాజు మట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రతీవారు క్రీస్తును ఆరాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఆనందరెడ్డి, పతివాడ శ్రీను, తానేటి దేవ, చర్చి సంఘ సభ్యులు పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

యువకుడిపై బైండోవర్ కేసు నమోదు



రవితేజకు కౌన్సిలింగ్ ఇస్తున్న తహసీల్దార్ దశిక వంశీ

అత్తిలి: మండలంలోని బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఈవ్ టీజింగ్ చేస్తున్న అత్తిలి మండలం మొయ్యేరు గ్రామానికి చెందిన పులిదిండి రవితేజ అనే యువకునిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ దశికవంశీ సోమవారం తెలిపారు. అత్తిలి మండలం బల్లిపాడు హైస్కూల్ వద్ద రవితేజ తరచూ బాలికలను ఈవ్ టీజింగ్ చేస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు అత్తిలి ఎస్ఐ పి ప్రేమరాజు, రవితేజను అదుపులోకి తీసుకుని, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అయిన తహసీల్దార్ దశిక వంశీ కోర్టులో హాజరు పర్చారు. రవితేజ నుంచి బైండోవర్ పత్రాలను తీసుకున్నట్లు తహసీల్దార్ వంశీ తెలిపారు.

ఆరోగ్య నియమాలు పాటిద్దాం



వార్డుల్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వ్యాధులకు దూరంగా ఉండాలని సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు తెలిపారు. సోమవారం 9, 27వార్డులలో అవగాహన ర్యాలీలు జరిగాయి. బేబి సెంటర్, కడకట్ల పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాల పరిశీలన, ఆరోగ్య కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజలందరు సంయుక్తగా డ్రై డే తప్పక పాటించాలని కోరారు. ప్రజలందరు వ్యక్తిగత ఆరోగ్యం, పరిసరాల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. దోమలను నిర్మూలించేందుకు శానటరీ, ఆరోగ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు; ఆశాలు, సహాయకులు కనక రత్నం, వెంకటలక్ష్మి, స్వాతి, దుర్గ లక్ష్మి, ఏలూరి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

25న చిలకంపాడులో రక్తదాన శిబిరం

పెంటపాడు: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని పెంటపాడు హెర్మోన్ హోం ఆధ్వర్యంలో ఈనెల 24న చిలకంపాడు హెర్మోన్ ప్రార్థనా మందిరంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంఘ కాపరి సీహెచ్ డేవిడ్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మదర్ పుష్పయోహాను, పాస్టర్ల సంఘ నాయకులు సీహెచ్ మనష్షే పాల్గొంటారన్నారు. సంఘ సభ్యులు పాల్గొనాలని డేవిడ్ కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



ప్లాస్టిక్ కవర్లు పట్టుకున్న మునిసిపల్ శానిటరీ విభాగం అధికారులు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తక్కువ మైక్రాన్స్ ఉన్న ప్లాస్టిక్ కవరులను వాడవద్దని, వాడితే ప్రజా ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుందని మునిసిపల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ ఇనస్పెక్టర్లు ఎస్వీ శ్రీమన్నారాయణ, సోమేశ్వరరావులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బస్సు డిపో వెనుక భాగంలోని 33వ వార్డులోని సూపర్ మార్కెట్‌లో మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు ఆదేశాలు మేరకు శానిటరీ అధికారులచే ప్లాస్టిక్ నివారణలో భాగంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 70 కేజీల తక్కువ మైక్రాన్స్ ఉన్న ప్లాస్టిక్ కవర్స్‌ను పట్టుకున్నారు. యాజమాన్యానికి రూ. 10 వేలు అపరాద రుసుం విధించారు. కవర్లును, ఫైన్‌ను పురపాలక సంఘానికి అందజేశారు. వక్తలు మాట్లాడుతూ ప్రజలు తమకు సహకరించాలని, ప్లాస్టిక్ వాడాకాన్ని ఆపాలని, గడ్డు సంచులు, గన్నీ బ్యాగ్‌లు తీసుకువెళ్లాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గుడ్డు సంచులు, గన్నీబ్యాగ్స్ అందుబాటులో ఉంచాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మునిసిపల్ మేనేజర్

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు అర్జీలు వచ్చినట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో ఎం. వెంకటేష్ తెలిపారు. జగన్నాథపురం గ్రామంలో లే అవుట్ ఆక్రమణలను తొలగించాలని పేరాబత్తుల వరలక్ష్మి, మరికొందరు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, మారంపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 948–1లోని 1.13 సెంట్లకు గాను రెండు సెంట్లు తక్కువగా ఉన్నట్లు రీ–సర్వేలో తేలిందని, ఆ భూమి సరిహద్దు రైతు పొలంలో ఉందని, సర్వేకు అతను సహకరించడం లేదని, తన భూమి తనకు ఇప్పించాలని దూలం వెంకన్న అర్జీలో కోరారు. వాటిని సంబంధిత శాఖలకు పంపించినట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వెంకటే తెలిపారు.

నాలుగు వినతులు

తాడేపల్లిగూడెం: ప్రజాసమస్యల పరిష్కారవేదికలో భాగంగా సోమవారం మునిసిపల్ కార్యాలయంలో వివిధ సమస్యలపై నాలుగు ఫిర్యాదులు అందాయి. మునిసిపల్ మేనేజర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మెట్లు



తణుకు టీటీడీ కల్యాణ మండపం ప్రాంతంలో ప్రమాదకరంగా మెట్లు

తణుకు అర్బన్: స్థానిక టీటీడీ కల్యాణమండపం, పెద్ద వంతెన ప్రాంతంలో ఉన్న కాలిబాట బెట్లు ప్రమాదకరంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైనుంచి కింది వరకు పూర్తిస్థాయిలో మెట్లు లేకపోవడంతో మెట్లు ఉన్నాయనుకుని కాలువేసి కిందకు పడిపోయి ప్రమాదాల పాలువుతున్నామని చెబుతున్నారు. అంతేకాకుండా మెట్లకు ఉన్న గోడ కూడా కూలిపోవడంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. రాష్ట్రపతి రోడ్డు నుంచి టీటీడీ కల్యాణ మండపం ప్రాంతంలోను, ఎస్‌బీఐ ప్రాంతంలోను నివాసముంటున్న వారు ఎక్కువగా ఇదే మెట్లపై నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రోజూ ఎవరోఒకరు పడిపోతున్న ఘటనలు చూస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఈ మెట్లకు మరమ్మతులు చేయించి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.

జోరుగా.. హుషారుగా

- రబీ సాగులో రైతుల బిజీ
- గ్రామాల్లో వరినాట్ల హడావుడి
- అన్నదాతలకు.. సూచనలు, సలహాలు



దాళ్వా నాట్లు వేయడానికి దమ్ముచేసిన పొలం

ఇరగవరం: జిల్లాలోని రైతులు రబీ వరిసాగులో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ పంట కోతలు పూర్తికావడంతో రబీ పనులతో బిజీగా ఉన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా వరినాట్లు జోరుగు సాగుతున్నాయి. చీడపీడలను అధిగమించి, అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను ఎంచుకోవడంతో పాటు నారుమళ్లు వేయడం, పెరిగిన నారుతో నాట్లు పనులు ఊపందుకున్నాయి.

అనేక ప్రయోజనాలు

వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. సాగు పనులు ప్రారంభించినప్పటికీ నుంచి వీటిని చేపట్టాలి. తద్వారా పంటను చీడపీడలు, తెగుళ్లు ఆశించకపోవడంతో పాటు భూమికి సారం లభిస్తుంది. పంటలు ఏపుగా పెరుగుతాయి.

అధికంగా ఎరువులు వాడితే నష్టమే..

పంట ఏపుగా పెరగాలని, దిగుబడి ఎక్కువగా రావాలనే ఉద్దేశంతో కొందరు రైతులు తమ పొలాల్లో ఎరువులు, పురుగుమందులను విపరీతంగా వాడుతున్నారు. దీనివల్ల పెట్టుబడి బాగా పెరిగిపోవడంతో పాటు భూసారం దెబ్బతింటుంది. పరిమితికి మించిన ఎరువుల వాడకం వల్ల నష్టం కలుగుతుంది. పొలంలో భూసార పరీక్షలు చేయించి, ఆ నివేదికలో వెల్లడైన ఆంశాల ఆధారంగా ఎరువులు వాడాలి. తద్వారా భూమికి అవసరమైన పోషకాలు లభిస్తాయి. తణుకు నియోజకవర్గంలో ఇరగవరం, అత్తిలి, తణుకు రూరల్ మండలాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈవారంలో మరికొందరు రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పొలాలను దమ్ముచేసి నాట్లు వేయడానికి సిద్ధం చేశారు. అయితే విచిత్రంగా మండలంలో మెజార్టీ రైతులు ఇంకా నారుమడులు తయారీలోనే ఉన్నారు. కొన్ని చోట్ల విత్తనాలు చల్లుతున్నారు. మరో వారం రోజుల్లో మొత్తం నారుమడులు పూర్తి చేసే అవకాశం ఉంది. మొత్తంమీద వచ్చే నెలాఖరుకు దాళ్వా నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. సంక్రాంతికి నాటికే నూరుశాతం నాట్లు పూర్తిచేయాలన్న లక్ష్యంతో వ్యవసాయ అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు.

సార్వా నష్టాలు

గత సార్వా పంట ఆరంభంలో భారీ వర్షాలు వరదల కారణంగా 90 శాతం వరినాట్లు పూర్తిగా పాడైపోయి, రైతులు రెండోసారి నారుమడులు, వరినాట్లు వేయాల్సి వచ్చింది. సార్వా మాసూళ్ల సమయంలో వర్షాలు, తుఫాన్లు, వాయుగుండ ప్రభావంతో మాసూళ్లు పూర్తిచేయడానికి రైతులకు ఖర్చులు రెట్టింపయ్యాయి. తగ్గిన దిగుబడి, పెరిగిన పెట్టుబడితో రైతులకు సార్వా పంట నష్టాలనే మిగిల్చింది.

నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో దాళ్వా

తణుకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 50వేల ఎకరాల్లో దాళ్వా వరిసాగు జరుగుతుంది. తణుకు, ఇరగవరం మండలాల్లో బోర్లున్న పొలాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. కాలువ కింద భూముల్లో ఇప్పుడిప్పుడే నాట్లు ప్రారంభమయ్యాయి. అత్తిలి మండలంలో ఇంకా వరినాట్లు వేగం పుంజుకోలేదు. ఈనెలాఖరుకు వరినాట్లు ముమ్మరమయ్యే అవకాశం ఉంది.

ముురగ దమ్ములు ప్రారంభం

నారుమడులు వేయడం పూర్తిచేసిన రైతులు పొలం దమ్ములు ప్రారంభించారు. ఇప్పటికే రైతులు జింక్, బోరాన్ ఎరువుల మిశ్రమాన్ని పొలంలో వేసి మురగ దమ్ములు చేస్తున్నారు. దీనివల్ల వరి మోడులు, పొలంలో మిగిలిపోయిన వరిగడ్డి బాగా కుళ్లి భూమిలో కలిసిపోతుంది. దీనివల్ల వరినారుకు బలం చేకూరుతుంది.

త్వరగా నాట్లు పూర్తిచేయాలి

వాతావరణ పరిస్థితులు దృష్ట్యా రైతులు త్వరగా నారుమడులు పూర్తిచేయాలి. ఈనెలాఖరుకు నాట్లు పూర్తిచేయడానికి యత్నించాలి. కనీసం జనవరి మొదటి వారంలోగా నాట్లు పూర్తి చేయాలి. రబీసాగుకు స్వల్పకాలిక విత్తనాలు సాగుచేస్తే మంచి ఫలితాలుంటాయి.

– వై. రాఘవేంద్ర ఏవో, ఇరగవరం